సాక్షి తిరుపతి
శనివారం : 26 : ఆగస్టు : 2023



ఇస్రో ప్రయోగాలకు శ్రీసిటీ ఉత్పత్తులు

ఇస్రో రాకెట్ ప్రయోగ కేంద్రంలో జరిగే ప్రయోగాలకు శ్రీసిటీలోని పలు పరిశ్రమలకు చెందిన ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. - 8లో



'శ్రీకాళహస్తి'కి శాంతారాం పేరు

శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి శాంతారాం జే పవార్ పేరు పెడతామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. - 8లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	36	26
చిత్తూరు	36	24
తిరుమల	31	21
గూడూరు	37	26
నగరి	36	26

న్యూస్‌రీల్

ఉద్యోగుల గ్రీవెన్స్‌సెల్‌కు 13 ఫిర్యాదులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌కు జిల్లా వ్యాప్తంగా 13 ఫిర్యాదులు వచ్చినట్టు కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగస్తులు వారికి సంబంధించిన ఇంక్రిమెంట్లు, పే ఫిక్షేషన్, బెనిఫిట్స్, పీఆర్సీ తదితర వ్యక్తిగత సమస్యలను నిబంధనలకు లోబడి గ్రీవెన్స్‌సెల్‌లో పరిష్కరించుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో జయరాములు, జిల్లా గ్రామ, వార్డు సచివాలయ అధికారిని సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డ రక్షణే ధ్యేయం

తిరుపతి అర్బన్: తల్లీబిడ్డ రక్షణకు పటిష్టమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో మాతా శిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ శ్రీహరితోపాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, అంగన్వాడీ వర్కర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆధునిక పద్ధత్తుల్లో వైద్య సేవలందిస్తున్న తరుణంలో మాతాశిశు మరణాలకు స్వస్తి చెప్పాలని స్పష్టం చేశారు. పీహెచ్‌సీల్లో రోగులకు మెరుగైన సేవలు అందించాలన్నారు. డాక్టర్లతో పాటు వైద్య సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని చెప్పారు. ప్రధానంగా ఎంఎస్ఎస్ యాప్ ద్వారా ప్రతి పీహెచ్‌సీ పరిధిలోనే హైరిస్క్ గర్భిణులను గుర్తించి, వారికి సుఖప్రసవాలు అయ్యేలా చూడాలని తెలిపారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి, డీఐఓ శాంతకుమారి, ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి సూపరింటెండెంట్ పార్థసారథి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి పాల్గొన్నారు.



అమ్మవారి కంకణధారణలో అర్చకులు



అమ్మవారి స్వర్ణరథాన్ని లాగుతున్న భక్తులు



శాస్త్రోక్తం..వరలక్ష్మీవ్రతం

- జిల్లాలో మిన్నంటిన వేడుకలు
- భక్తిశ్రద్ధలతో వ్రతం ఆచరించిన మహిళలు



శ్రీకాళహస్తిలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



గాజుల అలంకరణలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ



ప్రత్యేక అలంకరణలో ఆదిలక్ష్మీదేవి

శ్రీకాళహస్తి/ తిరుచానూరు(చంద్రగిరి), రాపూరు: జిల్లాలో వరలక్ష్మీవ్రతాన్ని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం నుంచి ఉపవాస దీక్షలతో వ్రతం ఆచరించి మొక్కులు తీర్చుకున్నారు. తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయ ఆస్థాన మండపంలో శుక్రవారం వరక్ష్మీవ్రతాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీపద్మావతీ అమ్మవారి ఉత్సవమూర్తిని ఆస్థాన మండపానికి వేంచేపు చేసి పద్మపీఠంపై ఆశీనులను చేశారు. రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి పుష్పాలతో అమ్మవారిని ఆరాధించారు. వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలకు సత్సంతానం, దీర్ఘమాంగల్యసౌఖ్యం, సిరిసంపదలు, ఆరోగ్యం, కుటుంబ సౌఖ్యం వంటి ఎన్నో మహాఫలాలు కలుగుతాయని అర్చకులు దీవెనలు అందించారు. సాయంత్రం అమ్మవారు స్వర్ణరథంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. తిరుపతి తాతయ్యగుంట గంగమ్మతల్లి గాజుల అలంకరణలో భక్తులను మంత్రముగ్ధులను చేశారు. అలాగే శ్రీకాళహస్తీశ్వరాలయంలోని బ్రహ్మగుడి వద్ద నిర్వహించిన వ్రతానికి మహిళా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఆలయ అర్చకులు కలశ స్థాపన చేసి లక్ష్మీపూజను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. మహిళల చేత కుంకుమ పూజ చేయించారు. రాపూరులోని పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన ఆదిలక్ష్మీదేవికి భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో పాల్గొనేందుకు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు తరలివచ్చారు.

> **అమ్మవారి అనుగ్రహం**
>
> వరలక్ష్మీవ్రతం ఆచరించడం వల్ల లోకం సుభిక్షంగా ఉంటుంది. అష్ట ఐశ్వర్యాలు, సుఖశాంతులను అమ్మవారు అనుగ్రహిస్తారు. శ్రీ మహాలక్ష్మి అవతరించిన దివ్యస్థలం తిరుచానూరులో వరలక్ష్మీ వ్రతం ఆచరించడం ఆనవాయితీగా వస్తోంది. ఆలయం వద్ద ఉన్న ఆస్థాన మండపంలో పాంచరాత్ర ఆగమం ప్రకారం అర్చకులు వరలక్ష్మీ వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు.
>
> – భూమన కరుణాకరరెడ్డి, టీటీడీ చైర్మన్



శ్రీకాళహస్తిలో వ్రతాన్ని ఆచరిస్తున్న మహిళా భక్తులు



పెంచలకోనలో వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరిస్తున్న భక్తులు

28న జిల్లాలో ముఖ్యమంత్రి పర్యటన



చిత్తూరు కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన జిల్లాలో పర్యటించనున్నారు. శుక్రవారం ఈ మేరకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది.

సీఎం పర్యటన షెడ్యూల్ ఇలా..

- ఉదయం 9.45 గంటలకు రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు
- 9.55కి అక్కడి నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి నగరి మండలం కీలపట్టుకు చేరుకుంటారు
- 10.45 బహిరంగ సభాస్థలికి రోడ్డు మార్గాన విచ్చేస్తారు
- మధ్యాహ్నం 12.35 గంటలకు జగనన్న విద్యాదీవెన పథకాన్ని ప్రారంభించి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు
- 12.45 గంటలకు సభాస్థలి నుంచి బయలుదేరి 12.50 గంటలకు డిగ్రీ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు చేరుకుంటారు
- 1.25 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 1.45 తిరుపతి జిల్లా రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి బయలుదేరి గన్నవరం చేరుకుంటారు.

ముమ్మర ఏర్పాట్లు



రోడ్‌షో మార్గంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

నగరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 28వ తేదీన నగరికి విచ్చేస్తున్న సందర్భంగా నిర్వహించనున్న సభకు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ముఖ్యమంత్రి రోడ్ షో నిర్వహించే మార్గంలో ఎలాంటి తోపులాటలకు అవకాశం లేకుండా పకడ్బందీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. సభా వేదికను జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు.

క్లుప్తంగా

శాస్త్రీయ పద్ధతుల్లో బయోమెడికల్ వ్యర్థాల సేకరణ

తిరుపతి అర్బన్: ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు సంబంధించిన బయో మెడికల్ వ్యర్థాల సేకరణలో శాస్త్రీయ పద్ధతులను అవలంబించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం జిల్లా బయో మెడికల్ పర్యవేక్షణ కమిటీ మొదటి సమావేశం నిర్వహించారు. బయో మెడికల్ వ్యర్థాల మానిటరింగ్ కమిటీ చైర్మన్ హోదాలో కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పత్రులకు చెందిన వివిధ వ్యవర్థాలను ప్రభుత్వం నిర్దేశించిన కలర్ కోడింగ్ బ్యాగ్‌ల్లో మాత్రమే సేకరించాలని చెప్పారు. నిర్మూలన నేపథ్యంలో కామన్ బయోమెడికల్ వేస్ట్ ట్రీట్మెంట్ ఫెసిలిటీకు మాత్రమే పంపాలని, అలాకాకుండా జనరల్ వ్యర్థాలతో కలిపి డిస్పోజ్ చేస్తే కఠినమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పర్యావరణ ఇంజినీర్ నరేంద్రబాబు మాట్లాడుతూ బయో మెడికల్ వ్యర్థాలను సమర్థవంతంగా శాస్త్రీయ పద్ధతుల్లో సేకరిస్తున్నట్లు చెప్పారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీసీహెచ్ఎస్ ఆనందమూర్తి, తిరుపతి కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ చంద్రమౌలీశ్వర్‌రెడ్డి, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ అన్వేష్, ఎస్వీ యూనివర్సిటీ ప్రొఫెసర్లు డాక్టర్ రాజ్యలక్ష్మి, శ్రీనివాసరావు, మదన్‌మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆహార పదార్థాలపై నిరంతరం పర్యవేక్షణ

- ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈఓ కమలవర్ధన రావు
- తిరుపతిలో 41వ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ సమావేశం
- హాజరైనా వివిధ రాష్ట్ర, కేంద్ర పాలిత అధికారులు



జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈఓ కమలవర్ధనరావు

తిరుచానూరు(చంద్రగిరి): ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలపై నిరంతరం పర్యవేక్షించాల్సిన బాధ్యత ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఉందని సీఈఓ గంజి కమల వర్ధనరావు తెలిపారు. గురువారం స్థానిక తాజ్ హోటల్ రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ ఆధ్వర్యంలో ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా 41వ సెంట్రల్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) సమావేశాన్ని నిర్వహించారు. ఫుడ్‌సేఫ్టీ కమిషనర్ ఏపీ.నివాస్ కలసి ఆయన జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సమావేశంలో వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఫుడ్‌సేఫ్టీ ప్రధాన కార్యదర్శులు, కమిషనర్లు, సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్ తదితర అధికారులు హాజరయ్యారు. అనంతరం సీఈఓ మాట్లాడుతూ ఆహార భద్రతను అమలు చేయడం ఈ కార్యక్రమ ముఖ్యఉద్దేశమన్నారు. ఈ సెంట్రల్ అడ్వైజరీ కమిటీలో దాదాపు 60 మంది ప్రతినిధులు ఉంటారన్నారు. ఎఫ్ఎస్ఎస్ఏఐ, సీఏసీ సమావేశాల నుంచి సూచనలు, అభిప్రాయాలను తీసుకోనున్నట్లు వెల్లడించారు. ఆహార భద్రతా చట్టం 2006 ప్రకారం నియమాలు, నిబంధనలలో నిరంతర ప్రాతిపదికన మార్పులను చేస్తామన్నారు. 21 సైంటిఫిక్ ప్యానెల్స్ ఏర్పాటుతో సుమారు 200 మంది శాస్త్రవేత్తలు మనిషి తీసుకునే మందులు కాకుండా ఇతర ఆహార పదార్థాల నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించి, వాటిని చట్ట పరిధిలో నియంత్రించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటం ఫుడ్ సేఫ్టీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల ఫుడ్ సేఫ్టీ శాఖల బాధ్యత అని గుర్తు చేశారు. 2023ను అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరంగా ప్రకటించిన నేపథ్యంలో దేశ వ్యాప్తంగా మిల్లెట్ (చిరు ధాన్యాల)ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు తెలిపారు. అనంతరం అజెండా మేరకు సాయంత్రం వరకు వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఫుడ్ సేఫ్టీ అధికారుల సమీక్షలో నాణ్యతా ప్రమాణాల మెరుగుదల పై సలహాలు, సూచనలు అందించారు. (ఐఆర్ఎస్) ఎఫ్ఎస్ఎస్ఏఐ ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ ఇనోషిశర్మ, క్వాలిటీ అండ్ అస్యూరెన్స్ విభాగం సలహాదారు సత్యన్‌కుమార్ పాండా, వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ఫుడ్ సేఫ్టీ కమిషనర్లు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి మున్సిపాలిటీకి శాంతారాం పేరు



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి వెల్లడి
- ఘనంగా శాంతారాం పవార్ కాంస్య విగ్రహావిష్కరణ



శాంతారాం కాంస్య విగ్రహావిష్కరణలో కుటుంబసభ్యులు

శ్రీకాళహస్తి: శాంతారాం జే పవార్ చేసిన సేవలకు గుర్తుగా శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి ఆయన పేరు పెడతామని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయ ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్, పురపాలక సంఘ మాజీ చైర్మన్ శాంతారాం జయంతి సందర్భంగా ది స్కూల్ ఆవరణలో ఆయన కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేతోపాటు ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, టీడీపీ నాయకులు బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ శాంతారాం జె పవార్ సేవలకు గుర్తుగా శ్రీకాళహస్తి పురపాలక సంఘానికి ఆయన పేరు పెడతామన్నారు. శాంతారామ్ జె పవార్ విగ్రహాన్ని శ్రీకాళహస్తిలో కూడా ఏర్పాటు చేసే విధంగా కార్యాచరణ రూపొందిస్తామని చెప్పారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బీజేపీ నాయకులు కోలా ఆనంద్, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, చెంచురెడ్డి, శాంతారాం కుటుంబ సభ్యులు, వైఎస్ఆర్‌సీపీ నాయకులు శెట్టిపల్లి సురేష్, పగడాల రాజు, ఉన్నం వాసునాయుడు, బర్రి హేమభూషణ్‌రెడ్డి, రత్నంరెడ్డి, పఠాన్ ఫరీద్, సిరాజ్‌బాషా, చంద్రయ్యనాయుడు, గోరా, డిష్ ధర్మయ్య, కౌన్సిలి రమేష్ పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలు బడిలో ఉండాలి

తిరుపతి అర్బన్: బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. అనంతరం ఆయ న మాట్లాడుతూ పదోతరగతి పూర్తి చేసుకుని ఇంటర్‌కు వెళ్లాల్సిన వారి సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోందని, మొత్తంగా 5–18 ఏళ్లలోపు పిల్లల్లో 40,414 వారి వివరాలను ఆన్‌లైన్ నమోదు చేయలేదన్నారు. వారి వివరాలను వందశాతం ఆన్‌లైన్ చేయించాలని డీఈఓ శేఖర్‌ను ఆదేశించారు. డీఎల్‌డీఓ సుశీలాదేవి, నాడు–నేడు ప్లానింగ్ కో–ఆర్డినేటర్ రామచంద్రారెడ్డి, ఆర్ఐఓ ప్రభాకర్‌రెడ్డి, డీవైఈఓ విశ్వనాథ్‌నాయక్, సర్వశిక్ష అభియాన్ సీఎంఓ సురేష్ పాల్గొన్నారు.

ఇస్రో ప్రయోగాలకు శ్రీసిటీ ఉత్పత్తులు

- మేక్ ఇన్ ఇండియా చిహ్నంగా పలు జాతీయ ప్రాజెక్టులతో శ్రీసిటీ అనుబంధం



శ్రీసిటీలోని వీఆర్వీ పరిశ్రమ వద్ద ట్యాంకర్‌కు జెండా ఊపి ఆరంభిస్తున్న దృశ్యం

వరదయ్యపాళెం: ఇస్రో రాకెట్ ప్రయోగ కేంద్రంలో జరిగే ప్రయోగాలకు శ్రీసిటీలోని పలు పరిశ్రమలకు చెందిన ఉత్పత్తులను వినియోగిస్తున్నారు. ఆ మేరకు చంద్రునిపై చంద్రయాన్–3 విజయవంతంగా ల్యాండింగ్ చేయడం దేశీయ పారిశ్రామిక రంగానికి అత్యంత ప్రోత్సాహక అంశమని శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఇస్రో ప్రయోగాలకు అవసరమైన మౌలిక సదుపాయాలను, పరికరాలను శ్రీసిటీ నుంచి పలు పరిశ్రమలు సరఫరా చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఆ మేరకు శ్రీసిటీలోని వీఆర్వీ, ప్రోటోలోక్, వాల్‌మేట్, ఇంజినీరింగ్ అనే 3 పరిశ్రమల నుంచి పలు ఉత్పత్తులను ఇస్రో ప్రయోగాలకు వినియోగిస్తున్నారని తెలిపారు. వీఆర్వీ పరిశ్రమలో ప్రధానంగా నైట్రోజన్, ఆక్సిజన్, ఆర్గాన్, కార్బన్‌డైయాక్సైడ్, ద్రవ హైడ్రోజన్, సహజ వాయువుల నిల్వ కోసం అత్యాధునికమైన ఎల్‌హెచ్–2 ట్యాంకు, ఎల్‌వీఎం3 ట్యాంకులను ఇస్రోకు సరఫరా చేసినట్టు పేర్కొన్నారు. అలాగే యూకేకు చెందిన ప్రోటోలోక్ ఇండియా పరిశ్రమలో తయారయ్యే కొన్ని పొడర్లు ఇస్రో సాలిడ్ రాకెట్ ప్రొపలెంట్ పరికరాలు ఎల్వీఎం3, పీఎస్ఎల్వీలు, జీఎస్ఎల్వీలు, ఎస్ఎస్ఎల్వీలు ఘన ప్రొపలెంట్ తయారీలకు ఉపయోగపడతాయని తెలిపారు. అలాగే వాల్‌మేట్ ఇంజినీరింగ్ పరిశ్రమలో అల్లాయిస్, నికెల్, టైటానియం, కోబాల్ట్, అల్యూమినియం మొదలైన వాటిని వివిధ రూపాల్లో ఎల్వీఎం3, చంద్రయాన్–3, ఇస్రో లాంచ్ వెహికల్స్ ఉపగ్రహాల హార్డ్‌వేర్‌లను రూపొందించడానికి ఈ పరిశ్రమల ద్వారా ముడి పదార్థాలను సరఫరా చేసినట్లు ఆయన వివరించారు.

భద్రతా ప్రమాణాలు పాటించాలి



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

తిరుపతి అర్బన్: పరిశ్రమలు భద్రతా ప్రమాణాలు కచ్చితంగా పాటించాలని, సంబంధిత అధికారులు పరిశ్రమల్లో సేఫ్టీ మేజర్మెంట్‌పై అవగాహన కల్పించాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 500 మందికి పైన కార్మికులు పనిచేస్తున్న 25 పరిశ్రమల్లో తరచూ తనిఖీ చేయాలన్నారు. అర్హత మేరకు సత్వరమే యూనిట్ల మంజూరు, పెండింగ్ దరఖాస్తుల గ్రౌండింగ్ చేయాలని చెప్పారు. సింగిల్ డెస్క్ విధానంలో ఏప్రిల్ 2023 నుంచి 309 పరిశ్రమలకు గాను 271 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామని, మరో 36 పరిశ్రమల అనుమతులు పరిశీలనలో ఉన్నాయన్నారు. ఏర్పేడు మండలం మధవమాల గ్రామంలో ఉడ్ కార్వింగ్ క్లస్టర్, రేణిగుంట మండలంలోని ఎర్రమరెడ్డిపాళెం గ్రామంలో కాపర్ వేజెల్స్ క్లస్టర్, వెంకటగిరి శారీ ప్రింటింగ్, డైయింగ్ క్లస్టర్, నారాయణవనం పవర్ లూమ్ క్లస్టర్ ఏర్పాటుకు చేపట్టిన చర్యల పురోగతిపై సమీక్షించారు. తిరుపతి జిల్లా నుంచి పరిశ్రమల ఉత్పత్తులు, ఎగుమతులు 2023–24 మే 23 నాటికి రూ.1996.43 కోట్లుగా ఉందన్నారు. జిల్లా పరిశ్రమల అధికారి ప్రతాప్‌రెడ్డి, జోనల్ మేనేజర్ ఏపీఐఐసీ తిరుపతి చంద్రశేఖర్, లీడ్ బ్యాంకు మేనేజర్ సుభాష్, కార్మికశాఖ ఉప కమిషనర్ బాలునాయక్, అడిషనల్ అగ్నిమాపక అధికారి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



కోటిరెడ్డి(ఫైల్)

దొరవారిసత్రం: నెల్లూరుపల్లి గ్రామానికి చెందిన కామిరెడ్డి కోటిరెడ్డి(37) విద్యుత్ షాక్‌కు గురై గురువారం సాయంత్రం మృతి చెందిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలు.. నెల్లూరుపల్లి గ్రామానికి చెందిన కోటిరెడ్డి వ్యవసాయంతో పాటు పాడిపశువులు మేపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం మేసేందుకు వెళ్లిన పశువులను తోలుకొచ్చేందుకు పంట పొలాల వైపు వెళ్లగా అక్కడ పొలాలుకు వేసి ఉన్న కరెంట్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలికపోవడంతో కుటుంబ సభ్యులు రాత్రంతా గాలించారు. చివరికి శుక్రవారం ఉదయం పొలాలవైపు వెళ్లి చూడగా కోటిరెడ్డి మృతి చెంది పడి ఉన్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానిక ఎస్ఐ తిరుమరావు కేసు నమోదు చేసి మృత దేహాన్ని పోస్టుమర్టం నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

శ్రీవారి దర్శనానికి 15 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 18 కంపార్ట్‌మెంట్లు నిండాయి. గురువారం అర్ధరాత్రి వరకు 67,308 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 26,674 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.82 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 15 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

సీల్డ్ టెండర్లకు ఆహ్వానం

తిరుపతి అర్బన్: జిల్లాలోని 12 ఐసీడీఎస్ ప్రాజెక్టుల గోదాముల నుంచి బాలామృతం పౌష్టకాహారం ప్యాకెట్లను అంగన్‌వాడీ సెంటర్లకు రవాణా చేయడానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నట్టు ఐసీడీఎస్ పీడీ జయలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఆసక్తి గల వారు శనివారం సెప్టెంబర్ 7వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంట వరకు టెండర్ దాఖలు చేసుకోవచ్చని, అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు కలెక్టర్ కోర్టుహాల్‌లో టెండర్లు ఓపెన్ చేస్తామని తెలిపారు.

వీధి కుక్కలకు వ్యాక్సినేషన్

తిరుపతి అర్బన్: వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ ఇవ్వాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జంతువులతో వచ్చే వ్యాధులు, వాటి నివారణకు సంబంధించి ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. జంతువులతో కలిగే వ్యాధులపై ప్రజలకు పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ప్రధానంగా టీటీ, ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమానికి డీఎంహెచ్‌ఓ డాక్టర్ శ్రీహరి, డీపీఓ రాజశేఖర్‌రెడ్డి, జిల్లా పశుసంవర్థకశాఖ అధికారి రవికుమార్, డీసీహెచ్ఎస్ ఆనంద్‌మూర్తి, వైరాలజీ స్విమ్స్ ఆస్పత్రి ఉష కళావత్, జూపార్క్ చీఫ్ క్యూరేటర్ సెల్వం పాల్గొన్నారు.

రోకలితో కొడుకుపై తండ్రి దాడి



వెంకటేశ్వర్లు(ఫైల్)

దొరవారిసత్రం: తండ్రి క్షణికావేశంలో రోకలితో కొడుకు దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతిచెందాడు. ఈ సంఘటన దొరవారిసత్రం మండలం, పడమటికండ్రిగ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు, పోలీసుల కథనం..పడమటికండ్రిగకు చెందిన పుట్టమనేని వెంకటకృష్ణయ్య కొడుకు వెంకటేశ్వర్లు(28) మద్యానికి బానిసయ్యాడు. మద్యం కోసం డబ్బులు ఇవ్వాలంటూ తల్లిదండ్రులను రోజూ వేధించేవాడు. గురువారం సాయంత్రం తండ్రిని ముప్పుతిప్పలు పెట్టాడు. అతని వద్ద ఉన్న రూ.200 ను బలవంతంగా లాక్కున్నాడు. దీంతో ఆవేశానికి లోనైన తండ్రి అక్కడే ఉన్న రోకలితో కొడుకుపై దాడిచేశాడు. తీవ్రంగా గాయపడిన వెంకటేశ్వర్లును నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి అతను మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం

పెద్దపంజాణి: మండలంలోని తిప్పిరెడ్డిపల్లె గ్రామం వద్ద గురువారం రాత్రి 8 ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టించాయి. గంగులప్ప, బాబు, వినోద్ అనే రైతులు సాగు చేస్తున్న వరిపైరును తొక్కి నాశనం చేశాయి. ఏనుగుల కారణంగా సుమారు రూ.50వేల పంట నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగుల సంచారం అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.



ఏనుగులు తొక్కేసిన వరి పంట

అట్టహాసంగా టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు



టీసీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఆర్డీఓ కిరణ్‌కుమార్

గూడూరు రూరల్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి, సెప్టెంబర్ 5 ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ క్రీడామైదానంలో మూడు రోజులపాటు జరగనున్న రాష్ట్రస్థాయి టీచర్స్ క్రికెట్ లీగ్ పోటీలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. గూడూరు ఆర్డీఓ కిరణ్‌కుమార్, డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై క్రీడాకారులను పరిచయం చేసుకుని టీసీఎల్ క్రికెట్ లీగ్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఆహ్లాదకర వాతావరణంలో ఉపాధ్యాయులకు రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ప్రతిఒక్కరూ క్రీడా స్ఫూర్తిని పెంపొందించాలన్నారు. ఈ టోర్నీలో 18 మండలాల నుంచి క్రీడా జట్లు పాల్గొననున్నట్టు తెలిపారు. సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రియా రియల్ ఎస్టేట్స్ అధినేత బాబు అగస్త్యన్, సభ్యులు వాకాటి రామ్మోహన్‌రావు, ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, పీడీ కరిముల్లాఖాన్, పిల్లెళ్ల శ్రీను, ఎం.రాధయ్య, మురళీసింగ్, బాబర్, సతీష్ పాల్గొన్నారు.